క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలల్లో బీకాం జనరల్ కొనసాగించాలి

ఏఐఎస్ఎఫ్ నాయకులు



పిడుగురాళ్ల : ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో బీకాం జనరల్ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డిగ్రీ కోర్సుల్లో ప్రభుత్వ కళాశాలల్లో బీకాం జనరల్‌ను 42 కాలేజీలకు మాత్రమే పరిమితం చేసిందని, కానీ ప్రైవేటు కాలేజీల్లో బీకాం జనరల్ కొనసాగుతుందని, పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకోలేక పోతున్నారని వెంటనే బీకాం జనరల్ ప్రభుత్వ కళాశాలల్లో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి మధు, పట్టణ అధ్యక్షులు సాయి, ఉమర్, రాజా, రాహుల్ తదితరులు ఉన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా సుదర్శన్

కారెంపూడి: పాస్టర్స్ ఫెలోషిప్ కారెంపూడి మండల అధ్యక్షుడిగా సుదర్శన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కారెంపూడి శివారు ఆదినారాయణ కాలనీలో బుధవారం పాస్టర్ల సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కొమ్ము జాకబ్, కార్యదర్శిగా జె.జాన్సన్, సంయుక్త కార్యదర్శిగా వై.రవికుమార్, పి.జోసెఫ్, కోశాధికారిగా షేక్ జానీ, కె.ఇమ్మానియేలు, గౌరవాధ్యక్షులుగా మాచర్ల ప్రకాశరావు ఎన్నికయ్యారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

నకరికల్లు: మండలంలోని చేజర్ల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.నాగేందర్‌రావు బుధవారం తెలిపారు. చేజర్ల గ్రామంలో అక్రమ మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో గ్రామానికి చెందిన పమ్మి వెంకటేశ్వర రెడ్డి వద్ద 40 క్వార్టర్‌ల మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు. సదరు వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన ప్రేమికుల జంటలో యువతి మృతి

సత్తెనపల్లి: ఆత్మహత్యకు యత్నించిన ప్రేమికుల జంటలో చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీకి చెందిన బండారు నవీన్ (25), చిలకలూరిపేటకు చెందిన మెడబలిమి అనూష (22) ప్రేమించుకున్నారు. కుటుంబ సభ్యులు అంగీకరించరని భావించిన వారిరువురు ఈ నెల 3న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. వీరిని సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ నవీన్ ఈ నెల 5న మృతి చెందిన విషయం తెలిసిందే. అనూష చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. క్షణికావేశం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది.

మిషన్ శక్తిపై అవగాహన కార్యక్రమం



వినుకొండ(నూజెండ్ల): మిషన్ శక్తి భారతీయ న్యాయ సంహిత అవగాహన కార్యక్రమంలో భాగంగా వినుకొండ పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలనీలో గల అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది ఆరె సామ్రాజ్యం మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు వివాహం జరిపించడం చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, ఆహారంపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు కె.విజయకుమారి, సీహెచ్. సుధారాణి, జి.నాగజ్యోతి, ఎ.రేవతి, పి.వి.గాయత్రి, కె.సోని పాల్గొన్నారు.

నేడు కౌలు వేలం

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులో వేంచేసి ఉన్న వీరేశ్వరస్వామి వారి దేవస్థానానికి సంబంధించిన భూములకు దేవదాయ ధర్మాదాయ చట్టం ప్రకారం ఈ నెల 11వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు స్వామి వారి దేవాలయ ఆవరణలో కౌలు వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు. 2024–27 వరకు కౌలు హక్కు పొందేందుకు వేలం జరుగుతుందని, పాల్గొనే వారు ముందుగా డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖ చట్టం ప్రకారం వేలం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఆశాజనకంగా పత్తి పంట

కారెంపూడి: పల్నాడులో వేసవి పత్తి పైర్లు ఆశాజనకంగా ఉన్నాయి. పల్నాట చాలా కాలంగా వేసవిలో ఏప్రిల్, మే నెలల్లో పత్తి వేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలోనే రైతులు ఈ ఏడాది కూడా ముందస్తుగా పత్తి సాగు చేపట్టారు. అన్ని పంటలు బోర్ల కిందనే సాగు చేస్తున్నారు. ప్రస్తుతం అన్నీ కూడా దాదాపు 70 రోజుల పైర్లు అయ్యాయి. అన్నీ మంచి కాపు మీద ఉన్నాయి. గూడ, పూత, పిందెలతో పైర్లు కళకళలాడుతున్నాయి. ఇప్పటికే చెట్టుకు 30 కాయలు దాకా ఉన్న పైర్లు ఉన్నాయి. దీంతో పత్తి పంట మీద రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఎకరాకు 15 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుందని ఆశ పడుతున్నారు. క్వింటా పత్తి ధర ప్రస్తుతం రూ.6 వేల దాకా ఉంది. ఆగస్టులో పత్తి తీతలు ప్రారంభం అవుతాయి. ఇప్పటి వరకు వాతావరణం అనుకూలించడంతో పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. వర్షాలు ఎక్కువగా పడకపోవడంతో పత్తి పంట దెబ్బతిన లేదు. అధిక వర్షాలు పడితే సహజంగానే పూత, పిందెలు రాలిపోవడంతో ఆశించిన కాపు కనపడేది కాదు. ఒక రకంగా వర్షాలు తక్కువ పడడం వేసవి పత్తికి బాగా కలసి వచ్చింది. మాచర్ల, గురజాల నియోజకవర్గాలలో సుమారు 22 వేల హెక్టార్లలో పత్తి పంట సాగవుతోంది. మాచర్ల రూరల్, వెల్దుర్తి, దుర్గి, రెంటచింతల, గురజాల, దాచేపల్లి, మాచవరం మండలాలలో ముందస్తు పత్తి సాగు జరుగుతోంది. పత్తి సాగు పూర్తయిన తర్వాత రెండవ పంటగా కంది లాంటి అపరాల పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు పత్తి సాగుపై శ్రద్ధ చూపుతున్నారు. వాస్తవంగా పల్నాడులో పత్తి పంట తప్పితే మిగతా పంటల సాగు ప్రారంభం కాలేదు. కాల్వలకు నీరు రాకపోవడంతో మాగాణి భూములన్నీ ఖాళీగానే ఉన్నాయి. బోర్ల కింద అక్కడక్కడ వరి నారుమళ్లు పోస్తున్నారు. పత్తి సాగు లేకపోతే పల్నాడులో వాస్తవంగా ఖరీఫ్ సాగు ఇప్పటి వరకు లేనట్లే. పత్తి సాగు ఆ కొరతను తీర్చింది.



కారెంపూడిలో సాగులో ఉన్న పత్తి పంట

అంగన్‌వాడీ డిమాండ్‌లను పరిష్కరించాలి

సీఐటీయూ నాయకుడు ఏపూరి గోపాలరావు

గురజాల : జూలై 10వ తేదీన అఖిల భారత కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా కార్మిక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, జాతీయ నగదు బదిలీకరణ, ప్రైవేటీకరణలను నిలుపుదల చేయాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, 108, 104 తదితర పథకాల కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారిపై జరుగుతున్న రాజకీయ వేధింపులు నిషేధించాలని పలు డిమాండ్లు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తపరుస్తున్న కార్మికులు

వాహనాలు నడిపే వారు ప్రభుత్వ నిబంధనలు పాటించండి



మాచర్ల: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషురెడ్డి కోరారు. బుధవారం ప్రమాద నివారణ రహిత అవగాహన కార్యక్రమంలో భాగంగా పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు ఎడమ వైపు వాహనాలను నడపాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. ప్రమాదాలు జరగకుండా.. అతి వేగంగా వాహనాలు నడప రాదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, వాహనదారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నాణ్యతలో రాజీ వద్దు

ఎంపీడీవో కె.సరోజనీదేవి

మాచర్ల రూరల్: విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించటంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీడీవో కె.సరోజనీదేవి కోరారు. బుధవారం మండల పరిధిలోని కంభంపాడు గ్రామంలోని జెడ్పీహెచ్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల చిన్నారులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం మేలైన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తుందని, ఈ ఆహారాన్ని సమయపాలన ప్రకారం ఎటువంటి లోటు లేకుండా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మధ్యాహ్న భోజనాన్ని తిని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులను బోధన తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రామిరెడ్డి విజయకుమారి, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ బిట్టు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తెడ్ల మురళి, మోహన్‌రావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మాచర్ల: తెల్లవారుజామున పట్టణ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మరణించిన ఘటన పట్టణ పరిధిలోని చెన్నకేశవ నగర్ కాలనీ ప్రాంతంలో బుధవారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ బి.బ్రహ్మయ్య తెలిపిన కథనం ప్రకారం మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన దొంతగాని శ్రీనివాసరావు గౌడ్ (45) తెల్లవారుజామున 4 గంటల సమయంలో మాచర్ల పట్టణంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రెంటచింతలలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు సందర్భంగా బుధవారం స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి నేతృత్వంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు స్థానిక అంబేడ్కర్ కాలనీలోని వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నంశెట్టి అంకమ్మరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవి రత్నాకర్ ఆదేశాల మేరకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు జూలై 1 నుంచి 31వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి ఏడిస్ లార్వాలను గుర్తించి వాటిని నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, భరించలేని తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించటం, చర్మంపై దద్దుర్లు, కనుగుడ్డు కదపలేనంతగా కళ్ల నొప్పి వంటి లక్షణాలు డెంగీ వ్యాధి లక్షణాలు అని ఇవి కన్పించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. దోమలు కారణంగా వ్యాపించే వ్యాధులపై గ్రామాలలో ప్రజలకు వివరించి ఫ్రైడేను డ్రైడేగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు ఎస్.కోటేశ్వరరావు, లక్ష్మీ ప్రసన్న, హెల్త్ అసిస్టెంట్‌లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య, ఆశా కార్యకర్తలు

కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేయాలి

సత్తెనపల్లి: ప్రతి కౌలు రైతుకు పంట సాగుదారు (సీసీఆర్సీ) కార్డు జారీ చేసి బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇప్పించాలని డీబీఆర్సీ రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పంట సాగుదారుల హక్కు చట్టంపై ఆటో ప్రచార ఉద్యమ కార్యక్రమాన్ని నందిగామ పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ సత్తెనపల్లి మండలం నందిగామ, అబ్బూరు, ఫణిదం, బట్లూరు గ్రామాలలో కౌలు రైతుల ప్రచార ఉద్యమం నిర్వహించటం జరుగుతుందని, పంట సాగుదారు కార్డు దారులందరికీ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో క్రాప్ లోన్లు మంజూరు చేయడం, కిసాన్ క్రెడిట్ కార్డులు అందించడం, వివిధ రుణ సంస్థల నుంచి తీసుకున్న రుణాన్ని ఇంత వరకు చెల్లించని రైతులకు తిరిగి రుణం చెల్లించేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, సాగుదారు కార్డు పొందిన వారికి ఆ భూమిపై ఎటువంటి హక్కులు రావని కేవలం పంట రుణాలు, బీమా, సబ్సిడీ వంటి ప్రభుత్వ మద్దతు పొందటానికి మాత్రమేనని, కార్డుపై సాగుదారు బ్యాంకు నుంచి పంట రుణాలు తీసుకున్నట్లయితే దానిని కట్టే బాధ్యత పూర్తిగా కౌలు దారుదేనన్నారు. యజమానిపై ఎటువంటి భారం ఉండదని, కనుక భూ యజమానులు సాగుదారులకు సాగుదారు కార్డు పొందటానికి సహకారం అందించాలని కోరారు. కౌలు రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, వారికి పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డీబీఆర్సీ ఏరియా కోఆర్డినేటర్స్ మేడే వెంకటరమణ, కోటి రత్నం, కౌలు రైతులు తదితరులు ఉన్నారు.



ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

అచ్చంపేట: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద బుధవారం యూటీఎఫ్ (యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్) నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీని వేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు వేతన సవరణ ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలన్నారు. పాఠశాలల విలీనం జీవో 117ను రద్దు చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టును భర్తీ చేసి ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల శాఖ గౌరవాధ్యక్షులు తుమ్మా శౌరైడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ మహబూబ్ బాషా, జిల్లా కార్యదర్శి కె.ప్రకాశరావు, కోశాధికారి పూర్ణచంద్రరావు, మహిళా సంయుక్త కార్యదర్శి వాసవికన్యక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ అచ్చంపేట మండల శాఖ ఉపాధ్యాయులు

షేడ్‌నెట్ నర్సరీల నిర్వాహకులు లైసెన్స్ కలిగి ఉండాలి

ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్‌కుమార్

క్రోసూరు: షేడ్‌నెట్ నర్సరీల నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని షేడ్‌నెట్ నర్సరీలను ఉద్యాన అధికారి దాసరి నవీన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ సందర్శించారు. మండలంలోని అనంతవరం, క్రోసూరు గ్రామాల్లోని నర్సరీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ ప్రతి షేడ్‌నెట్ నర్సరీ యజమాని తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని చెప్పారు. దీనికి గాను దగ్గర్లోని రైతు సేవ కేంద్రంలో అర్జీ పెట్టుకోవాలని తెలియజేశారు. లైసెన్స్ లేని నర్సరీలకు నోటీసులు అందజేసినట్లు చెప్పారు. వారం రోజుల వ్యవధిలో ప్రతి షేడ్‌నెట్ నర్సరీ యజమాని లైసెన్స్ పొందాలని తెలిపారు. లైసెన్స్ లేని నర్సరీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నర్సరీల్లో వినియోగించిన విత్తనాలు, విక్రయించిన నారు, రకాలకు సంబంధించిన రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు.

డంపింగ్ యార్డు తొలగించాలి

నరసరావుపేట ఈస్ట్: పట్టణ ప్రవేశ రహదారి ఎస్ఆర్‌కేటీ కాలనీ వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌ను వెంటనే తొలగించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని బుధవారం సీపీఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ వల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి నుంచి వచ్చే దుర్గంధం భరించలేక సమీప ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. డంపింగ్ యార్డుపై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్పందించి అక్కడి నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, షేక్ చినజాన్‌సైదా తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు పాఠశాలల్లో చదువుకోవాలి

నాదెండ్ల: బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో చేరి విద్యాభ్యాసం చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని అమరావతి సమగ్ర శిక్షా స్టేట్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ డి.మల్లికార్జున్ చెప్పారు. నాదెండ్ల మండల విద్యావనరుల కేంద్రాన్ని బుధవారం ఆయనతో పాటూ బృందం సభ్యులు విచ్చేశారు. ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులతో నేను బడికి పోతా కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 12 నుండి జులై 13 వరకూ ప్రతి గ్రామంలో ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ నెల 25 వరకూ పాఠశాలల్లో బడి బయట పిల్లలను చేర్చుకోవచ్చన్నారు. నాదెండ్ల మండల పరిధిలో ఇప్పటి వరకూ 1వ తరగతిలో 320 మంది, ఆరో తరగతిలో 500 మందికి పైగా విద్యార్థులు చేరినట్లు ఎంఈవో కృష్ణారెడ్డి వివరించారు. చిన్నారులను పనిలో పెట్టుకున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటూ పల్నాడు జిల్లా ఏఎల్ఎస్ కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఐఈడీ కోఆర్డినేటర్ సెల్వరాజు, ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

గురజాల : ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక నవోదయ డిగ్రీ కళాశాలలో బుధవారం రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ వాడాలని ప్రమాదం జరిగినా తలకు దెబ్బ తగలకుండా మృత్యువు నుంచి బయటపడవచ్చన్నారు. అదే విధంగా కారు నడిపే వారు సీటు బెల్టు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి, షేక్ జానీబాషా, ఎస్ఐ సౌందరరాజన్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

క్రీస్తు చూపిన మార్గంలో ప్రజలను నడిపించాలి

పాస్టర్ సత్యం

రెంటచింతల: గ్రామీణ ప్రాంతాలలో దైవవాక్కు (ప్రార్థన) ప్రచారం చేసే పాస్టర్లు ప్రజలను యేసు క్రీస్తు చూపిన సన్మార్గంలో నడిపించాలని పాస్టర్ ఎస్.సత్యం అన్నారు. బుధవారం స్థానిక అంకమ్మనగర్ కాలనీలోని యేసుక్రీస్తు ప్రార్థన మందిరం 7వ వార్షికోత్సవం సందర్భంగా 50 మంది పాస్టర్లతో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కూడికలో ఆయన మాట్లాడారు. ప్రపంచ మానవాళిని పాపముల నుంచి రక్షించుటకై సిలువ మరణం పొందిన దేవుని కుమారుడైన యేసును ఆరాధించి ఆయన అడుగుజాడలలో నడవాలని కోరారు. యేసుక్రీస్తు సూక్తులు ఆచరిస్తూ సమాజంలో ప్రజల పట్ల ప్రేమ, కరుణ, జాలి, దయ కలిగి శాంతియుతంగా జీవించాలన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పల్లెర్ల లక్ష్మారెడ్డిని ఘనంగా సన్మానించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు మాజీ ఎంపీటీసీ వై.రమేష్, ఆదూరి శివ, వై.శ్రీనివాసరావు, కె.సైదులు, ఎస్.నర్సింహారావు, లేళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న పాస్టర్ సత్యం

పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలి

ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు

రెంటచింతల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకంపై చిన్న, సన్నకారు రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండలంలో కచ్చితంగా 200 ఎకరాలలో పండ్ల తోటలను చిన్న, సన్నకారు రైతులు సాగు చేసేలా క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. పండ్ల తోటలు సాగుచేసే రైతులు 5 ఎకరాలలోపు పంట పొలం, ఉపాధి హామీ జాబు కార్డు కలిగి ఉండాలన్నారు. ఈ పథకం కింద మామిడి, జామ, బత్తాయి, నారింజ, సపోట, దానిమ్మ, సీతాఫలం, నిమ్మ, జీడిమామిడి తదితర 19 రకాల పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. ప్రతి రోజు మండలంలోని 11 గ్రామాలలో సుమారు 13 వేల మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, ఏపీవో జయ చంద్ర కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో శంకర్‌రావు

రోటరీ క్లబ్ సేవలు ఎనలేనివి

మాచర్ల: పట్టణంలోని పాత కిడ్స్ పాఠశాల, కేసీపీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 37వ రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. ఈ కార్యక్రమాననికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ రోటరీ క్లబ్ 150కి పైగా దేశాలలో లక్షలాది క్లబ్‌ల ద్వారా పేదవారికి తమ వంతు సహాయ సహకారాలందించటమే కాకుండా ప్రభుత్వాలకు సైతం సాయమందించటంలో గొప్పదని అన్నారు. మాచర్ల పట్టణంలో, మండలంలో రోటరీ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో గొప్ప సేవలందించారని, ప్రభుత్వాసుపత్రికి విలువైన వస్తువులను అందించటం జరిగిందన్నారు. చిన్నారులకు పోలియో రాకుండా రోటరీ క్లబ్ సేవలందిస్తుందన్నారు. నూతన కార్యవర్గ అధ్యక్షురాలిగా కొండవీటి కృష్ణ కుమారి, సెక్రటరీగా నిమ్మగడ్డ సురేఖ, అన్నపురెడ్డి లక్ష్మి, ట్రెజరర్, ఉపాధ్యక్షురాలు ఎస్.కల్పన దేవి, సంయుక్త కార్యదర్శి తిరుమల రాధలచే డీసీహెచ్ఎస్ నరసరావుపేటకు చెందిన బి.వెంకట రంగారావు, కె.శరత్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ గవర్నర్ చంద్రను సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం.సుమిత్ర కుమార్, తాళ్ళ రాజశేఖర్ రెడ్డి, డిప్యూటీ గవర్నర్, వైద్యులు కె.రామకోటయ్య, మురహరిరావు, కేసీపీ జనరల్ మేనేజర్ వెంకట రమణ, జేవీకేఎస్ ప్రసాద్, చిలుకూరి నరసింహారావు, బంకు ప్రసాద్, పందిరి నరసింహారావు, మేడం చెన్నకేశవరావు, మేడం శివ, గోపవరపు నాగేశ్వరరావు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



రోటరీ క్లబ్ గవర్నర్ చంద్రను సన్మానిస్తున్న సభ్యులు